క్లుప్తంగా

రేపు మెగా న్యూరాలజీ వైద్యశిబిరం

గుంతకల్లుటౌన్: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు రోటరీహైస్కూల్‌లో ఉచిత మెగా న్యూరాలజీ వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, శివానంద శుక్రవారం తెలిపారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ భరత్ విష్ణురెడ్డి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేస్తారన్నారు.

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తు



డీఎస్పీ గంగయ్యను సత్కరిస్తున్న కళాశాల చైర్మన్ భాస్కర్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: క్రమశిక్షణతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని డీఎస్పీ సీఎం గంగయ్య పేర్కొన్నారు. స్థానిక సర్ సీవీరామన్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చదువుపై మాత్రమే దృష్టి పెట్టి కళాశాల, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలన్నారు. కళాశాల చైర్మన్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఇందూదర్‌రెడ్డి, తాడిపత్రి రూరల్ ఎస్‌ఐ గౌస్ మహమ్మద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది ‘స్వచ్ఛతా హీ సేవ’

గుంతకల్లుటౌన్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, అధికారులు, నాన్‌పీహెచ్ వర్కర్లు శ్రమదానం చేశారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే రిజర్వాయర్ల పరిసరాల్లో పెరిగిన ముళ్లకంపలు, పిచ్చిమొక్కలను తొలగించారు. చెత్తాచెదారాన్ని ఊడ్చేశారు. కార్యక్రమంలో ఎంఈ గురప్పయాదవ్, డీఈలు రామ్మూర్తి, హేమచంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జ్యోత్స్నను అభినందిస్తున్న నగరూరు ఉపాధ్యాయులు

యాడికి: అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో ఇటీవల ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ అండర్-14 విభాగం ఖోఖోలో నగరూరు ఉన్నత పాఠశాలకు చెందిన జ్యోత్స్న, డిస్క్‌త్రోలో నిట్టూరు ఉన్నత పాఠశాలకు చెందిన అశోక్‌కుమార్ ప్రతిభ చాటారు. గురువారం ఆయా పాఠశాలల్లో జరిగిన అభినందన సభలో హెచ్‌ఎంలు కుళ్లాయప్ప, శివరామిరెడ్డి మాట్లాడుతూ జ్యోత్స్న, అశోక్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని శ్రీకృష్ణదేవ రాయ కల్యాణమండం సమీపంలో శుక్రవారం కర్ణాటక మద్యం విక్రయిస్తున్న పుట్లూరు మండలం కడవకల్లు గ్రామానికి చెందిన బిజిలి పెద్దన్న, మిద్దె ఓబయ్యను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 74 బెంగళూరు విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు.
గుంతకల్లు రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో కర్ణాటక మద్యం తరలిస్తున్న అనంతపురం వాసి లక్ష్మి, కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన ఎరుకలి శారదను సెబ్ పోలీసులు శుక్రవారం సాయంత్రం పట్టుకున్నారు. నిందితుల నుంచి 768 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ మహేష్‌కుమార్, ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

గుత్తిరూరల్: రజాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో శుక్రవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం సంస్థ, కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి ఆధ్వర్యంలో వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డ్రోన్ల ద్వారా మందులు పిచికారీ ఎలా చేయాలి, పెరటి తోటలో ఎలా మొక్కలు పెంచాలి, మట్టి పరీక్షలు, విత్తన శుద్ధి ఎలా చేస్తారు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఉషారాణి, ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి, బీటీఎం లావణ్య, కేవీకే కో ఆర్డినేటర్ మల్వేశ్వరీ, శాస్త్రవేత్తలు శశికళ, సుధారాణి, కిషోర్‌రెడ్డి, రాజన్న, ఆదిలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



యల్లనూరు మండలం కల్లూరులో మందులు తీసుకుంటున్న రోగులు



గుత్తి మండలం వన్నేదొడ్డిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

యల్లనూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరంలా మారిందని మండల స్పెషలాఫీసరు ఫిరోజ్‌ఖాన్ అన్నారు. కల్లూరు సచివాలయం వద్ద శుక్రవారం జగన న్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యులు లక్ష్మీసంధ్య, పూజిత, సాయినాగశ్రీ, శివసాయి 263 మందికి వైద్యపరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. తహసీల్దారు సుమతి, సూపర్‌వైజర్ రాము, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
తాడిపత్రిటౌన్: మండలంలోని దిగువపల్లి గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు కేశవనంద్, యశస్విని, మంజుల, సుమన్, రామానుజన్ రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. జిల్లా ప్రత్యేక అధికారి నారాయణస్వామి కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ రంగారావు పాల్గొన్నారు.
పుట్లూరు: కందికాపులలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 202 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసినట్లు వైద్యాధికారి శ్రీవాణి తెలిపారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్, ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
పెద్దపప్పూరు: మండలంలోని సోమనపల్లిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటుచేశారు. వైద్యులు కళ్యాణ్ కుమార్, ఉషారాణి రోగులకు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఎంపీపీ వెంకటరామిరెడ్డి (రామయ్య) సర్పంచు రమేష్ నాయుడు, ఎంపీటీసీ నారాయణ పాల్గొన్నారు.
యాడికి: రాయలచెరువు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. వైద్యులు శ్రీరామ్ కుమార్, దేవరాజన్, అనంతపురం వైద్య నిపుణులు లక్ష్మీసంధ్య, పవన్‌కుమార్, కంటి వైద్య నిపుణుడు మధుసూదన్‌రాజు 450 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలోపౌష్టికాహార స్టాళ్లు ఏర్పాటు చేశారు. వైస్ ఎంపీపీ జమ్మలమడుగు హసీనాబేగం, సర్పంచు తలారీ అరుణ, తహసీల్దార్ అలెగ్జాండర్, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.
నార్పల: సుల్తాన్‌పేట సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, సర్పంచు మన్నీల సుప్రియ, ఉప సర్పంచు గవ్వల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.
గుత్తి: వన్నేదొడ్డి గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచు బేడల లక్ష్మీదేవి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యులు సందీప్ యాదవ్, దేవేంద్ర నాయక్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విశాలాక్షి, ఎంపీడీఓ శివాజీ రెడ్డి, సూపర్‌వైజర్ పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.
బుక్కరాయసముద్రం: కేకే అగ్రహారంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు 305 మందికి పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, ఎంపీడీఓ తేజోత్స్న, సర్పంచ్ బాగ్యమ్మ, డాక్టర్లు శ్రీహర్ష, వినో తదితరులు పాల్గొన్నారు.
గార్లదిన్నె: కోటంక గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. కంటి వెలుగు కింద వృద్ధులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ విజయభాస్కర్, సర్పంచు లక్ష్మి, ఉప సర్పంచు ఎల్లారెడ్డి, ఎంపీటీసీ అంజలి పాల్గొన్నారు.

రామకేశవరెడ్డికి ఘన నివాళి



రామకేశవరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

పుట్లూరు: మండలకేంద్రంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత భూమిరెడ్డి రామకేశవరెడ్డి(80) అంత్యక్రియలు అశ్రు నయనాల మధ్య ముగిశాయి. శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, అనంతపురం ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మాజీ ఎమ్మెల్యే గుత్తా వెంకటనాయుడు, తాడిపత్రి మున్సిపల్ చైర్మెన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు రామకేశవరెడ్డి పార్థీవ దేహం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెద్ద ఎత్తున ప్రజలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు మర్తాడు విద్యార్థులు



రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన మర్తాడు హైస్కూల్ విద్యార్థులు

గార్లదిన్నె: మర్తాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం నాగరాజు శుక్రవారం తెలిపారు. ఇటీవల అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్ -14 విభాగంలో ఏపీయు రెడ్డి, నవిత, మధు, అండర్-17 విభాగంలో విష్ణు, జగదీష్, లోకేష్, ప్రశాంత్, హిల్, అఫ్సార్, వేణుగోపాల్ ,పవిత్ర, హేమలత, అండర్-14 విభాగంలో పద్మ వెంకటేశ్వరరెడ్డి, నవిత ప్రతిభ కనబరిచారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు, పీడీ శ్రీనివాసులరెడ్డిని పాఠశాల సిబ్బంది అభినందించారు.
పామిడి: ఖాదర్‌పేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సరిత తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అండర్-14 విభాగం బాస్కెట్‌బాల్ పోటీల్లో డీ భవిత, డీ నందకిశోర్, అండర్-17 బాలికల విభాగంలో వై లహరి, అండర్-14 లాంగ్‌జంప్‌లో ఎం సుదర్శన్ ప్రతిభ చాటరన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

మత్స్యకారుల సంక్షేమానికి చర్యలు



చెరువులోకి చేపపిల్లలను వదులుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

శింగనమల: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం శింగనమలలోని రంగరాయుల చెరువులోకి మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను వదిలి పెట్టారు . ఎంపీపీ యోగేశ్వరి, సర్పంచ్ నాగమునెమ్మ, వైస్ ఎంపీపీలు విజయ, నరసింహులు, మత్స్య కార్పొరేషన్ డైరెక్టర్ కేవి రమణ హాజరయ్యారు. డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రత్యేక చొరవతో శింగనమల చెరువును లోకలైజేషన్ చేయించారన్నారు. నాలుగేళ్ల నుంచి చెరువులో నీరుండని, దీంతో మత్స్యకారులకు ఉపాధి దొరుకుతోందన్నారు. తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ నిర్మలాకుమారి, మత్స్యశాఖ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పక్కీరయ్య, మత్స్య సహకార సంఘం ప్రెసిడెంట్ వెంకటనారాయణ, పాపారాయుడు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎంపీపీ యోగేశ్వరి

శింగనమల: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వాటిని అర్హులందరికీ అందించాలని ఎంపీపీ యోగేశ్వరి అధికారులకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మొహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను కుల, మత, పార్టీల భేదం లేకుండా అందిస్తున్నారన్నారు. ఇంకా అర్హత ఉండి పథకాలు అందని వారికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ ఈశ్వరమ్మ మాట్లాడుతూ మండలంలో భూసర్వే జరుగుతోందని, రైతులు సహకరించాలని సూచించారు. ఏఓ అన్వేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో పంట నమోదు చేయించుకున్న రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలని కోరారు. ఎంపీడీఓ నిర్మలాకుమారి, వైస్ ఎంపీపీలు నరసింహులు, విజయ, ఎంపీటీసీలు ఉమా, మొరార్జీ, సర్పంచ్ నాగమునెమ్మ, రాజమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మతల్లికి బోనాలు



బోనాలతో వస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సచివాలయం వద్ద వెలసిన పెద్దమ్మ తల్లి ఆలయంలో భక్తులు శుక్రవారం బోనాలు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్ సీపీ సీనియర్‌నేత ఆలూరి రమణారెడ్డి, ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, ఎంపీటీసీ కాలువ వెంకటలక్ష్మి, ముసలమ్మ దేవత వంశస్తులు సూర్య నారాయణరెడ్డి, సుశీలమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయించారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ నాగార్జునరెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు.

రేపటి నుంచి శరన్నవరాత్రుల మహోత్సవాలు



గుంతకల్లు: దేవీనవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ప్రధానరహదారిపై ఏర్పాటు చేసిన భారీ తోరణం



తాడిపత్రి అర్బన్: మహాత్మాగాంధీ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

గుంతకల్లు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వర దేవి ఆలయంలో దేవీనవరాత్రుల ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు శుక్రవారం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాజగదీష్, కందూరి కృపాకర్ దేవీనవరాత్రుల సావనీర్ విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేవీ నవరాత్రులను ఈ నెల 15 నుంచి 24వ వరకు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. దసరా విశిష్టతను తెలియజేసే గోపూజ, గణపతి పూజ, గంగపూజ, హోమాలు తొమ్మిది రోజులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రోజుకో అలంకారంలో దర్శనమిస్తారన్నారు. దీంతోపాటు రోజుకో బృందంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈనెల 23న శమీదర్శనం, 24న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. పట్టణ ప్రజలు దేవీ నవరాత్రుల మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు చెల్లూరి నరసింహులు, పరిచూరు వెంకటేశ్వర్లు, గుంతారమేష్, ఇల్లూరు కేధారనాథ్, దేవరశెట్టి సుబ్రమణ్యం, గుణపూటి చంద్రమౌళి, రాజా వెంకటరమణ, రెంటల మధు, వీ.ప్రకాష్‌కుమార్, జగన్‌మోహన్, జీవన్‌గుప్తా పాల్గొన్నారు.
తాడిపత్రి అర్బన్: శరన్నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలోని శక్తి స్వరూపిణీ ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. పట్టణంలోని మెయిన్‌బజార్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని తమిళనాడు నుంచి వచ్చిన కళాకారులు రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయం ముందు భాగంలో ఆకర్షణీయమైన పుష్పాలతో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. స్థానిక మహాత్మాగాంధీ సర్కిల్, మెయిన్‌బజార్‌లో భారీ డిజిటల్ లైటింగ్ కటౌట్లు, స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. స్థానిక చింతల వెంకటరమణస్వామి ఆలయంలోని ఆనందవల్లి అమ్మవారి ఆలయం, సంజీవనగర్‌లో వేదగాయత్రీ దేవి ఆలయం, గానుగవీధిలోని చౌడేశ్వరి ఆలయం, జంగంవారి వీధిలోని అంకాలమ్మ, వడ్లపాలెంలోని మహాంకాళిమాత, రజకవీధిలోని గంగమ్మ, కటిక వీధిలోని చౌడేశ్వరీదేవి, అంబాభవాని వీధిలోని అంబాభవాని ఆలయాలు దసరా ఉత్సవాలకు ముస్తాబయ్యాయి.

పూర్వ విద్యార్థి చెట్టనాథన్ సేవలు ఎనలేనివి

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధితో పాటు విద్యార్థులకు చేయూతనందిస్తున్న కళాశాల పూర్వ విద్యార్థి, ఆర్యాధన్ ఫైనాన్స్ సొల్యూషన్స్ ఎండీ చెట్టనాథన్ సేవలు వెలకట్టలేనివని రూరల్ సీఐ మహేశ్వరరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో చెట్టనాథన్ సౌజన్యంతో రూ.2.90 లక్షల విలువ చేసే నోట్‌పుస్తకాలు, ఇతర స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు పదేళ్ల పాటు పుస్తకాలను ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలు, చెడువ్యసనాల జోలికివెళ్లకుండా ఉన్నతమైన లక్ష్యంతో ముందుకెళ్లాలని సీఐ తెలియజేశారు. కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ధనరాజ్, పూర్వవిద్యార్థుల సంఘం కోఆర్డినేటర్ జాకీర్‌హుసేన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు



నాయకులతో చర్చిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: కొర్రపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై నాయకులు, సిబ్బందితో చర్చించారు. గురుకుల పాఠశాల ప్రారంభోత్సవం రోజున ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, ఈమేరకు త్వరలో విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. జెడ్పీటీసీ భాస్కర్, సాకే లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ నాయకులు గంగరాజు, గుండప్ప, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గ్రామస్తులతో సమస్యలు తెలుసుకుంటున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన గదరగుట్టపల్లి, తేల్లమిట్టపల్లి, గోసువారిపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను తెలియజేయడంతోపాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పాలన సాగాలంటే జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుందామని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంగరావు, తహసీల్దార్ మునివేలు, జెడ్పీటీసీ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ తాడిపత్రి రూరల్ కన్వీనర్ పల్లె నాగేశ్వరరెడ్డి, వక్ఫ్‌బోర్డు సెక్రటరీ బాబా, మునిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రంగారెడ్డి, రాజేష్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మయ్య శుక్రవారం తెలిపారు. ఇంటర్మీడియట్ పాసై ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్స్ పొందని వారు అడ్మిషన్ కోసం ఒరిజినల్ మార్కుల జాబితా, కార్డు, టీసీ, స్టడీ,క్యాస్, సర్టిఫికెట్, ఆధార్‌లను తప్పనిసరిగా తీసుకురావాలని తెలియజేశారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

బుక్కరాయసముద్రం: కొర్రపాడు జెడ్పీ హైస్కూల్‌లో టెన్త్ క్లాస్ విద్యార్థులకు తహసీల్దార్ రమాదేవి శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థానాలు అధిరోహించాలన్నారు. స్టడీ మెటీరియల్ దాత పణిభూషన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడీసీసీ బ్యాంకులో సంబరాలు



కేక్ కట్ చేస్తున్న ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత

పామిడి: స్థానిక ఏడీసీసీ బ్యాంకు లావాదేవీలు రూ.50 కోట్ల మైలురాయి దాటడంతో శుక్రవారం బ్యాంకు చైర్‌పర్సన్ ఎం లిఖిత ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌తో పాటు మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు మాట్లాడుతూ లబ్ధిదారులు రుణాలను సక్రమంగా చెల్లిస్తే మరింత మందికి రుణాలు మంజూరు చేసే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. మెప్మా టీఎంసీ చంద్రశేఖర్, కొత్తపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, మహిళాసంఘాల సభ్యులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా దౌల్తాపురం ప్రభాకర్

గుంతకల్లు: కాంగ్రెస్ గుంతకల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న దౌల్తాపురం ప్రభాకర్‌ను ఆ పార్టీ జనరల్ సెక్రటరీగా నియమిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దౌల్తాపురం ప్రభాకర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలపారు.

రైతుల ఆదాయం పెంపునకు కృషి చేయండి

బుక్కరాయసముద్రం: రైతుల ఆదాయం పెంచేందుకు వ్యవసాయ శాఖ అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండన్న అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ సబ్సిడీతో మినీ ట్రాక్టర్లు, టార్పాలిన్‌లు, స్ప్రేయర్లు పంపిణీ చేసేలా ప్రతిపాదనలు పంపాలన్నారు. వెటర్నరీ ఏడీ డాక్టర్ రత్న కుమార్, ఏడీఏ రవి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఆలూరి రమణారెడ్డి, చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, కొర్రపాడు ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బయపరెడ్డి, ఎంపీటీసీ శివారెడ్డి, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పశువులకు గర్భకోశ పరీక్షలు తప్పనిసరి

నార్పల: పశువులకు గర్భకోశ పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బండ్లపల్లిలో పశువులకు గర్భస్థ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ పథకం గురించి ప్రతి పాడి రైతుకు అవగాహన కలిగి ఉండాలన్నారు. పథకం ద్వారా రూ.1,350 విలువ గల పెయ్య దూడలను పొందే రెండు సూదులను సబ్సిడీ పోను రూ.500కే రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. పశువైద్యాధికారిణి రాధిక తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

గుంతకల్లు రూరల్: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా గుంతకల్లు మున్సిపాలిటీతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ అంతరాయం ఉంటుందని డీఈఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రౌడీషీటర్ల జాబితా నుంచి తొలగించాలి

తాడిపత్రి అర్బన్: సత్ప్రవర్తనతో ఉన్న వారిని రౌడీషీటర్ల జాబితా నుంచి తొలగించాలని రాయలసీమ యునైటెడ్ ఫోరం(ఆర్‌యూఎఫ్)అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యల్లనూరు: లారీ పైనుంచి పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. ఏఎస్‌ఐ శ్రీనివాసులుగౌడ్ తెలిపిన వివరాలు..తిమ్మంపల్లికి చెందిన ప్రసాద్‌రెడ్డి(32) డ్రైవర్‌గా పని చేసేవాడు. మహారాష్ట్రలో లారీ పైనుంచి ప్రమాదవశాత్తూ కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని తోటి డ్రైవర్లు కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

గుత్తి కోట రైల్వే స్టేషన్‌లో వసతులు కల్పించాలి

గుత్తి: గుత్తి కోట రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని గుంతకల్లు డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్‌కు గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. తాగునీరు, విద్యుత్ దీపాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220722, 9010223701
9912220732, 9010588846